క్లుప్తంగా

26 మంది చిన్నారులకు ఆధార్ నమోదు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రంలో గురువారం 26 మంది చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షేక్ గౌస్‌నీషాబేగం, కృపావరం మాట్లాడుతూ మండల పరిధిలోని 68 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 26 మంది చిన్నారులకు ఆధార్ కార్డులను తీసినట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృపావరం, షేక్ గౌస్‌నీసాబేగం, కార్యకర్తలు యక్కంటి రాధమ్మ, శోభ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్స్


ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న పోలీసులు

కొండపి: రాత్రిళ్లు ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లు ఉపయోగపడతాయని సీఐ సోమశేఖర్ అన్నారు. రేడియం స్టిక్కర్స్‌పై గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు. సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొంతంగా రేడియం స్టిక్కర్లు అంటించుకొని రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని కొండబోయినపల్లెలో ప్రారంభించిన భూ రీసర్వే నులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతులతో, ప్రజలతో మమేకయి మాట్లాడుతూ రీసర్వే సిబ్బందికి రైతులు తమ భూముల వివరాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలు చూపి సర్వేచేయించుకోవాలన్నారు. భూసమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులకు అన్నదానం

కనిగిరిరూరల్: కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, చైర్మన్ ఎస్కే గఫార్ దాతృత్వంతో గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం ధ్రువీకరణ పత్రాల పునః పరిశీలనకు వచ్చిన దివ్యాంగులకు అన్నదానం చేశారు. వైద్యశాల సూపరిండెంట్ సుబ్బయ్య, వైద్యులు తిరుపతిరెడ్డి, ఆంజనేయులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎస్కే బుడే సాహెబ్, విశ్రాంత హెచ్ఎం ఎస్కే మస్తాన్‌వలి, బొట్టు శ్రీను, సమద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయం ఎదుట మహిళ ధర్నా


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళ

టంగుటూరు: అసెస్మెంట్ నంబర్ కేటాయిస్తే ఇంటి పన్ను చెల్లిస్తానని చెబుతున్నా అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట మహిళ ధర్నాకు దిగింది. వివరాల్లోకి వెళితే..కొణిజేడుకు చెందిన వంచా నాగవేణిరెడ్డి కొణిజేడులో స్థలం ఉంది. ఆ స్థలానికి పన్ను చెల్లించేందుకు అసెస్మెంట్ నంబర్ కేటాయించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో గురువారం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.5 వేలు లంచం ఇస్తేనే అసెస్మెంట్ నంబర్ కేటాయిస్తానని కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయింది. విషయాన్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, దీంతో విధి లేక ఆందోళనకు దిగినట్లు పేర్కొంది.

సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థుల ప్రతిభ

కనిగిరిరూరల్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో కనిగిరి ఎంఎస్ఎం కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. థర్డ్ బీఎస్సీ/బీజెడ్సీ లో కామిరెడ్డి ధనలక్ష్మి 878/900 మార్కులు, థర్డ్ బీఎస్సీ/ అగ్రికల్చర్‌లో మేర్ల మానిక 836/900 మార్కులు, థర్డ్ బీఎస్సీ / కంప్యూటర్‌లో ముక్కు మనీషా 735/800 మార్కులు, థర్డ్ బీకాం కంప్యూటర్స్‌లో దాసరి యామిని 624/700 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరక్టర్లు, ఏలూరి సుబ్బారావు, ఏలూరి నరేన్ చౌదరి, అధ్యాపకులు గురువారం అభినందించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ పాలన
- పార్టీ శ్రేణులంతా ఐక్యతగా పనిచేసి స్థానిక సంస్థల్లో విజయం సాధిద్దాం
- సమష్టిగా ముందుకు సాగి కనిగిరిపై జెండా ఎగరేద్దాం
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ


వేదికపై మాట్లాడుతున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని తాళ్లూరులో జరిగిన తిరునాళ్ల మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక.. అక్రమ అరెస్ట్‌లతో రాష్ట్రంలో కూటమి సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఎన్నికల సమయంలో మభ్యపెట్టి ఇప్పుడు కాకమ్మ కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనకు బదులు రెడ్‌బుక్ పాలన రాజ్యమేలుతోందని తీవ్రంగా విమర్శించారు. ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పథకాలు అందాయన్నారు. వైఎస్సార్ సీపీ ఒక పెద్ద సమూహమని, ఎన్ని పార్టీలు ఏమైనా ఏం చేయలేవన్నారు. పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయదుంధుభి మోగించాలన్నారు. 2029లో మళ్లీ జగనన్న సీఎం కావడం ఖాయమన్నారు.

దద్దాలకు ఘన స్వాగతం..

తాళ్లూరులో పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజా ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జై జగన్.. జై జై జగన్.. దద్దాల నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో రెట్టించిన ఉత్సాహంతో యువత, పార్టీ శ్రేణులు కేరింతలు వేశారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్‌ను స్థానిక పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. తొలుత తాళ్లూరు గ్రామంలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జి.ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, తాళ్లూరు సర్పంచ్‌లు మంగ తాయరమ్మ, మూలే మాల కొండారెడ్డి, మాజీ సర్పంచ్ మూలే ఈశ్వరమ్మ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రహీం బాషా, సంగన గురుబ్రహ్మారెడ్డి, బాలు రామిరెడ్డి, బాలు కోటిరెడ్డి, పాలూరి బుజ్జి, మూలే బయ్యన్న, గాలి వెంకటేష్, ఎస్కే ఖాజా రంతుల్లా, గుదే రమణయ్య, గుదే రామసుబ్బయ్య, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు బంకులపై అంత ప్రేమెందుకో..!

- రోడ్డు నిర్మాణంలో భాగంగా మార్జిన్‌లో దుకాణాల తొలగింపు
- రెండు బంకులు తప్ప మిగిలినవన్నీ తొలగించిన అధికారులు


జేసీబీతో రోడ్డు మార్జిన్లో మట్టి తొలగిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వెనకవైపున ఉన్న మినీ బైపాస్‌రోడ్డుకు రెండు వైపులా పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణకు రూర్బన్ పథకం నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. రోడ్డు మార్జిన్లో ఒక పక్క రామతీర్థం రక్షిత మంచినీటి పథకం పైపులైను ఉండగా మరో పక్క సుమారు 17 దుకాణాల వారు వివిధ వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం రోడ్డు మార్జిన్లో ఉన్న దుకాణాలు తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రోడ్డు నిర్మాణం ఎంతవరకు చేపతామో తెలిపేందుకు ఈనెల 7న పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ముగ్గు పోశారు. దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించకుంటే జేసీబీలతో తొలగిస్తామని హెచ్చరించారు. కొంత మంది వెంటనే దుకాణాలను తీసివేయగా..కొన్నింటినీ జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ఒక టీడీపీ సానుభూతిపరుడు, మాజీ సర్పంచ్‌కి చెందిన రేకులతో నిర్మించిన వీరిద్దరి బంకులు మాత్రం తొలగించలేదు. సదరు సర్పంచ్ తన బంకును ప్రభుత్వ పనులకు సిమెంట్ బస్తాలు నిల్వ చేసుకోవటానికి అద్దె పద్ధతిపై ఇస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. ఈనెల 12వ తేదీ బుధవారం పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి ఆధ్వర్యంలో మళ్లీ ముగ్గు వేసి ఈ ప్రకారం తొలగించాలని సూచించారు. ఆ ప్రకారం వీరిద్దరి రేకుల షెడ్డులు తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు మార్జిన్‌లో ఉన్న బంకులు తొలగించాలన్నప్పుడు ఈ ముగ్గుల పంచాయతీ ఏందని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్డుకు రెండోవైపు రామతీర్థం పైపులైనుతో రక్షిత మంచినీటి పథకం పైపులైన్ ఉందని, ఒకవేళ రోడ్డు వెడల్పులో భాగంగా ఈ ప్రాంతంలో రోడ్డు వేసినప్పుడు పైపులు ధ్వంసం అయితే ఏ విధంగా మరమ్మతులు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా జేసీబీతో మట్టి తొలగించే క్రమంలో రామతీర్థం పైపులైను ధ్వంసం కావడంతో పంచాయతీ సిబ్బంది వచ్చి పైపులైను మరమ్మత్తులు చేశారు.

వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు


పామూరులో చార్ట్స్ ప్రదర్శిస్తున్న ఎంఈఓ, హెచ్‌యం, విద్యార్థులు

పామూరు: చిన్నపిల్లలు, పెద్దలతో వెట్టిచాకిరి చేయిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. వెట్టిచాకిరి నిర్మూలనే ధ్యేయంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక హైస్కూల్ వద్ద స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెట్టిచాకిరి నిర్మూలపై విద్యార్థులకు, పెద్దలకు డిజిటల్ డాక్యుమెంటరీ కార్యక్రమం ప్రదర్శించి వీక్షించారు. ఉన్నతపాఠశాల హెచ్ఎం యం.రామ స్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: వెట్టిచాకిరి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వెట్టిచాకిరి చట్టంపై వాహన వీడియో ప్రచార, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల్ని బలవంతంగా పనిచేయించుకోవడం నేరమన్నారు. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కమిషనర్ డానియేల్ జోసఫ్, సీడీపీఓ సరోజని, ఎంఈఓ యు నారాయణరెడ్డి, మంద్రు రమేష్, నవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): వెట్టిచాకిరి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. సీఎస్‌పురంలో గురువారం గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెట్టి చాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించారు. మంద్రు రమేష్‌బాబు, రాజేష్, అంగన్‌వాడీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీపల్లి: బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓలు శ్రీనివాసచారి, సంజీవ్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు డి.ఆంజనేయులు, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు, కరాటే మాస్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతికుమారి


సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న

పొన్నలూరు: రెవెన్యూ సదస్సులో అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ విజయ జ్యోతికుమారి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 150 అర్జీల్లో పరిష్కరించిన దరఖాస్తులను పరిశీలించి ఆడిట్ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతులు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. భూ సర్వేలు, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుడదన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ పుల్లారావు, డీటీలు ప్రవంతి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కొండపి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. మండలంలోని కంద్రిక గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని రైతులకు ఇస్తున్న నోటీసులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మ్యూటేషన్‌కి సంబంధించిన ఫైల్స్‌ను ఆడిట్ చేశారు. రీ సర్వేలో ఎటువంటి అవకతవకలు పాల్పడకుండా నిర్వహించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ పి.మురళి, సర్వేయర్ రాజు, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

పామూరు: స్థానిక ఎర్రచేలు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్.రసూల్ లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ గురువారం బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించి కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుసేన్‌రెడ్డి, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మైనారిటీసెల్ అధ్యక్షుడు షేక్.గయాజ్, ఎస్సీసెల్ శ్రీరామ శ్రీనివాసులు, ఎలికా అచ్చయ్య, సిటిజన్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మి గ్రామంలో వార్డు మెంబర్ మాలపాటి లక్ష్మీకుమారి భర్త కొండలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దద్దాల నారాయణ యాదవ్ గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్యపడవద్దని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం లక్ష్మీకుమారికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా సర్పంచ్ నల్లగుంగుల సుబ్బరత్తమ్మ రూ.30 వేలు, సీనియర్ నాయకుడు చీమల పెద్ద బ్రహ్మారెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. జెడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, మండల కన్వీనర్ గోపవరపు బోర్రా రెడ్డి, ఐటీ విభాగం అధ్యక్షుడు లింగాలదిన్నె నరసింహారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొంద్రు నరసింహారావు, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి,సోషల్ మీడియా కో-కన్వీనర్ నల్లగంగుల శ్రీను, వళ్లెం మాల్యాద్రి, వెంగల్ రెడ్డి, పేరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

టంగుటూరు: రొయ్యల చెరువు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అనంతవరం గ్రామ దళితవాడ వాసులు గురువారం తహసీల్దార్ ఆంజనేయులుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతరంలోని సర్వే నంబర్ 253/2లో 1995-96 సంవత్సరంలో అప్పటి కలెక్టర్ అబ్బన్న రెండున్నర ఎకరా భూమిని 27 రొయ్యల చెరువులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేశారని తెలిపారు. మా పూర్వీకులు కొంతమంది మరణించారని, ఇప్పటికీ వాటిని సబ్ డివిజన్ చేసుకోలేదని తెలిపారు. అయితే మా గ్రామ నివాసి ఉప్పలపాటి సతీష్ రాజు అదునుగా చూసుకొని కొంతమంది దళితులకు డబ్బు ఆశ చూపించి దొంగ అగ్రిమెంట్ సృష్టించాడని తెలిపారు. ఈ దొంగ అగ్రిమెంట్ వల్ల మాలో మాకు గొడవలు సృష్టించారని వాపోయారు. మా భూమి మాకు ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

కొండపి: వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ పేదలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టే బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి జరగనున్న ఉద్యమాల్లో ప్రజలు పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం పరిశుద్ధరావు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, నాయకులు పాల్గొన్నారు

క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణచైతన్య

పొన్నలూరు: గ్రామాల్లో క్యాన్సర్ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణచైతన్య అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాయామంలో భాగంగా సైకిలింగ్, యోగా చేయడం వల్ల క్యాన్సర్ వ్యాధి రాకుండా నివారించవచ్చన్నారు. ప్రధానంగా ఆహారపు అలవాట్లను మార్చుకొని ఎక్కువగా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రవికిరణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ చంద్ర మౌళేశ్వరరావు

టంగుటూరు: పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వర్ అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించి విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి సిబ్బంది శిక్షణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్వీ సుధారాణి, మాధురి,జ్యోతి సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాణ్యతలో తేడా వస్తే బిల్లుల్లో కోత


తారు రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

హనుమంతునిపాడు: రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతలో తేడా ఉన్నా, కొలతలో తేడా ఉన్నా బిల్లులో కోత తప్పదని క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రారెడ్డి అన్నారు. మండలంలో పెద్దగొల్లపల్లి గ్రామం నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.90 లక్షతో జరిగిన తార్ రోడ్డు పనులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు తీశారు. కందుకూరు ఈఈ కేజేఎస్ చంద్రారెడ్డి, డీఈఈ వి.మాలకొండయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి, ఏఈఈ బి.బ్రహ్మయ్య, ఏఈ బాషా పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలు మరింత చేరువ కావాలి

కొండపి: పోస్టల్ పథకాలు ప్రజలకు చేరువ కావాలని ఒంగోల్ సౌత్ సబ్ డివిజనల్ ఆఫీసర్ జాఫర్ సాదిక్ అన్నారు. మండలంలోని స్థానిక పోస్టల్ కార్యాలయంలో గురువారం జీడీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ శాఖ ఇన్సూరెన్స్ ల గురించి ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి, ఎస్‌బీఎం అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ విధిగా చేయించుకోవాలి

సింగరాయకొండ: ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు షన్నారు. మండలంలోని కలికవాయ రైతు సేవా కేంద్రంలో జరిగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఏఓ వి సుధాకర్, సాంకేతిక ఏఓ శ్రీనివాస నాయక్, పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలోని మర్లపాడులో వ్యవసాయధికారి జి.స్వర్ణలత అధ్యక్షతన నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ వ్యవసాయాధికారి శ్రీనివాస నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

రాజోలుపాడు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

పొన్నలూరు: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా ఎంపికైన రాజోలుపాడు పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ సుజాత అధికారులను కోరారు. మండలంలోని రాజోలుపాడును గురువారం సందర్శించి సర్పంచ్ మార్తాల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఆదర్శ గ్రామం కింద రాజోలుపాడు సామాజికంగా, ఆర్థికంగా మంచి జీవన ప్రామాణాలతో అభివృద్ధి చెందాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో తాగునీటి వసతి, గృహాలు, అంతర్గత రోడ్లు నిర్మాణం, సాంఘిక ఆర్థికాభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు.

ముగిసిన తిరునాళ్ల మహోత్సవం


పూజలు అందుకుంటున్న స్వామి

కనిగిరిరూరల్: మండంలోని తాళ్లూరులో మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల మహోత్సవ వేడుకలు బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. స్వామికి గురువారం పొంగళ్లు, అభిషేకాలు, నైవేద్యాలు ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీప పూల అలంకరణలతో బహు సుందరంగా తీర్చి దిద్దారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆలయంలో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ విశిష్ట పూజలు నిర్వహించారు.


ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ యాదవ్, పార్టీ నేతలు